క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం



స్విచ్ ఆన్ చేసి బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వాణి

ఆత్మకూరు: మండలంలోని శ్రీపతిరావు పేట గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ వాణి బుధవారం గ్రామంలోని తాతేయకొట్టాల కాలనీలో నూతన బోరును వేయించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి నీటి సమస్య తీసుకువెళ్లారన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో నూతన బోరు ఏర్పాటు చేశామని, రెండున్నర ఇంచుల నీరు పడ్డాయని చెప్పారు. గత 20 సంవత్సరాలుగా కాలనీ ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడ్డారని ఈ బోరు ఏర్పాటు చేయడం మంచి నీటి సమస్య పరిష్కారం అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులుపుల్లారెడ్డి, రెహమాన్ పాల్గొన్నారు.

సెలవులపై తహసీల్దార్

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల తహసీల్దార్ రాజశేఖర్‌బాబు 19 రోజులపాటు వ్యక్తిగత సెలవులపై వెళ్లినట్లు ఆర్డీవో దాసు తెలిపారు. ప్రస్తుతం జూపాడుబంగ్లా తహసీల్దార్ పుల్లయ్య ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

పగిడ్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 18వ తేదీన జరగాల్సిన మండల సర్వ సభ్య సమావేశం ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాయిదా వేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. పగిడ్యాల పంచాయతీలో ఏర్పడిన 9వ వార్డు సభ్యుని ఉప ఎన్నికకు ఈనెల 19న పోలింగ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే 22న సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ స్వల్ప మార్పును గమనించాలని ఆయన కోరారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి



ఈ-క్రాప్ నమోదు చేయిస్తున్న ఏవో పవన్ కుమార్

వెలుగోడు: మండలంలోని రైతులు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏవో పవన్ కుమార్ సూచించారు. బుధవారం బోయరేవుల, వెలుగోడు ప్రాంతాలలోని రైతులతో మాట్లాడి వారు సాగు చేస్తున్న పంటల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట పొలంలో ఈ-క్రాప్ నమోదు చేయించి, దాని వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకష్ణ, వెంకట శివ ఉన్నారు.

కొత్తపల్లి: ఖరీఫ్ సీజన్ 2023-24 సంవత్సరానికి గాను పంటలు సాగుచేసుకొన్న ప్రతి రైతు పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని ఏఓ కె.మహేష్ సూచించారు. బుధవారం మండలపరిధిలోని దుద్యాల గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

ప్రతి ఒక్కరికీ పనికల్పించాలి

మహానంది: ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్కరికి ఉపాధి పని కల్పించాలని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త ఆదేశించారు. హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ వసుధ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యాన, అవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్, వంద పనిదినాలు, ఆధార్‌సీడింగ్ తదితర అంశాలపై చర్చించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



కషాయాల గురించి వివరిస్తున్న ఏఓ పీరునాయక్

మిడుతూరు: ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ఏఓ పీరునాయక్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని పీరుసాహెబ్‌పేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన కషాయాలు, ఘన జీవామృతం, ఎల్లోప్లేట్స్, లింగాకర్షక బుట్టలు రైతులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సుబ్బయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ నరేంద్రారెడ్డి, ఏడీపీఎం సలాం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ

- కలుపు నివారణ చర్యల్లో నిమగ్నం
- పంటలను కాపాడుకునేందుకు కాయకష్టం





వీరాపురం సమీపంలో మొక్కజొన్న పంటలో ఎరువు వేస్తున్న కూలీలు, ఎర్రమఠం గ్రామ సమీపంలో కాడెద్దులతో రసాయన ఎరువులు వేస్తున్న రైతన్నలు

కొత్తపల్లి: మండలంలోఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు. ఏ గ్రామ పొలిమేరల్లో.. ఏ పంటపొలంలో చూసినా వ్యవసాయ కూలీలే దర్శమిస్తున్నారు. జూలై నెలలో 179.0 మి. మీల వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా 279.4 మి.మీలు నమోదయ్యింది. దీంతో చెరువులు, కుంటలు, బావులు జలకళ సంతరించుకున్నాయి.

7,000 హెక్టార్లలో పంటల సాగు..

మండలంలో సుమారు వ్యవసాయభూమి 8,600 హెక్టార్లు ఉండగా గువ్వలకుంట్ల, వీరాపురం, కొత్తపల్లె, లింగాపురం,శివపురం, సింగరాజుపల్లె, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, కపిలేశ్వరం, గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ, కొత్తమాడుగుల, పాతమాడుగుల, దుద్యాల, నందికుంట, బావాపురం గ్రామాలలో సుమారు 7,000 హె క్టార్లలలో వివిధ రకాల పంటలు రైతులు సాగుచేసుకున్నారు. వీటిలో వరి 907, మొక్కజొన్న 4917, పత్తి 1028, కంది 204, ఉల్లి 25, కొర్ర 3, మిరప 40, పండ్లతోటలు 64, సోయాబీన్ 121,వివిధ రకాల కూరగాయాలు 40, ఖర్జూర ఒక హెక్టార్‌లో రైతన్నలు సాగుచేసుకున్నారు. అయితే వర్షం వరుపు ఇవ్వడంతో పంటలు కళకళలాడుతున్నాయి.



గువ్వలకుంట్ల సమీపంలో మొక్కజొన్నలో పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతన్న

దెబ్బతిన్న పంటలను కాపాడుకునే యత్నం..

కొన్ని చోట్ల ఎడతెరిపిలేని వార్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు కాయకష్టం చేస్తున్నారు. పంట చెలలో పెరిగిన కలుపుమొక్కలను నివారించేందుకు రైతులతో సహ వ్యవసాయకూలీలు పనులలో నిమగ్నమయ్యారు. పంటలకు ఎటువంటి తెగుళ్లు రాకుండా, ఏపుగా పంటలు పెరిగేలా రైతులు రసాయన ఎరువులు వేయడం, పురుగుల మందులు పిచికారీ చేయిస్తున్నారు. కొన్ని చోట్ల కాడెద్దులతో సేద్యం చేసి కలుపును నివారించేందుకు శ్రమిస్తున్నారు. అన్ని గ్రామాలలో చెరువులు, బావులు, కుంటలు నిండుగా ఉండడంతో ఖరీఫ్ సాగుకు నీటి కొరత ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కలుపు నివారణకు మందులు పిచికారీ చేయరాదు..



కొత్తపల్లి: రైతులు వ్యవసాయాధికారులు సలహాల మేరకు సాగులో మెలుకువలు పాటించాలి. కలుపు నివారణకు ఎక్కువ మందులు పిచికారీ చేయకూడదు. సాధ్యమైనంత వరకు మనషులు, యంత్రాలతో కలుపు తీయించుకోవాలి. పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు వేసుకోవాలి. ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రమే పిచికారీ చేయాలి. పైపాటుగా యూరియా, పోటాష్, పాస్పరస్ మాత్రమే వేయాలి. కాంప్లెక్స్ ఎరువులు పైపాటుగా వేయకూడదు. దుక్కిలో మాత్రమే వేయాలి.

– కె.మహేష్, ఏఓ

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఒప్పంద అధ్యాపకుల సంఘం తరపున ఆ సంఘం జేఏసీ కార్యదర్శి అబ్దుల్‌జబ్బార్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒప్పంద అధ్యాపకులలో 10,117 మంది అధ్యాపకులను రెగ్యులర్ చేయుటకు 5 సంవత్సరాల నిబంధనను సీఎం తొలగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మద్దిలేటి నాగేంద్ర, ఏకలవ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి తిమ్మాపురంలో 'గడప గడపకు మనప్రభుత్వం'

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలో ఈ నెల 22, 23న గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. రెండు రోజుల పాటు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.. అందులో భాగంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన పథకాల లబ్ధిని వివరిస్తారన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

రైతుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- కేసీ కాలువకు 674 , హంద్రీనీవాకు 674 క్యూసెక్కుల నీటి విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు రూరల్: రైతుల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీనీవాకు, కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగు చేసిన పంటలు వర్షాలు లేక ఎండిపోతున్నాయని రైతులు తన దృష్టికి తీసుకురావడంతో.. నీటి పారుదల శాఖ మంత్రి, జిల్లా మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి, నీటి విడుదలకు అనుమతులు తీసుకున్నానని చెప్పారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం 5 గంటలకు ఎత్తిపోతల పథకంలోని మోటార్లను స్విచ్ ఆన్ చేసి హంద్రీనీవాకు రెండు పంపుల ద్వారా 674 క్యూసెక్కులు, కేసీ కాలువకు రెండు మోటార్ల ద్వారా 674 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ప్రభుత్వం ఎప్పటికీ రైతుల పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు. మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయడంతో నియోజకవర్గంలోని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. నీటి విడుదలకు సహకరించిన నాయకులకు, మంత్రులకు, అధికారులకు, మెగా కంపెనీ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేవారు. అనంతరం కేసీ కాలువ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో కొణిదేల గ్రామ సర్పంచి నవీన్, కౌన్సిలర్లు జాకీర్ హుసేన్, ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, శంకరయ్య, రైతులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించిన దృశ్యం

ఆత్మకూరు: పట్టణంలోని పాతబస్టాండ్‌లో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి సన్నిధిలో లక్ష రక్షా కంకణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు స్వామివారికి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. 13 రకాల నక్షత్ర హారతులు, మహామంగళాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాత్రి భజన నిర్వహించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి హెచ్‌ఎంకు సూచనలు చేస్తున్న అధికారులు

పగిడ్యాల: ఈ నెల 19న జరిగే ఉప ఎన్నికకు సంబంధించి స్థానిక దేవనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన 9వ వార్డు పోలింగ్ బూత్‌ను బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుభాన్, ఎంపీడీఓ వెంకటరమణ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పరిశీలించారు. ఓటింగ్‌కు ఏలాంటి అభ్యంతరాలు లేకుండా పోలింగ్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌కు ఆదేశించారు.

పోలింగ్ అధికారుల నియామకం

జూపాడుబంగ్లా: ఈనెల 19న జరగనున్న తర్తూరు 2వ వార్డు ఉప ఎన్నికల నిర్వహణ నిమిత్తం పోలింగ్ అధికారులను నియమించినట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేజ్-2 అధికారిగా డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా పంచాయతీ కార్యదర్శి శాంతయ్య, పోలింగ్ ఆఫీసర్‌గా తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంటు ఓంప్రకాశ్, మరికొంత మందిని పోలింగ్ సిబ్బందిగా నియమించినట్లు తెలిపారు. పోలింగ్ నిర్వహణపై వారికి గురువారం నంద్యాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి



పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆర్డీఓ దాసు

నందికొట్కూరు రూరల్ : ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి దాసు కోరారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీకు చెందిన నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోపాలు లేని ఓటరు జాబితాను తయారు చేసేందుకు బీఎల్‌వోలు, ఎన్నికల అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఓటరు జాబితా ఇంటింటి పరిశీలనను అధికారులు వేగవంతం చేసి జాబితాలో అన్ని సక్రమంగా ఉన్నాయా, చనిపోయిన వారి పేర్లు, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఓటు నమోదుకు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ కిషోర్, మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ఐసీడీఎస్ పీడీ



మహానందికి వచ్చిన పీడీ నిర్మల

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల బుధవారం మహానందికి వచ్చారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు పీడీ నిర్మలకు ఆశీర్వచనాలు చేసి స్వామి,అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, టీచర్ పుష్పకళ, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా షేక్ రహత్



నందికొట్కూరు: మార్కెట్ యార్డు కమిటీ కార్యవర్గం జాబితాను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. నందికొట్కూరు మార్కెట్ యార్డు హానర్ చైర్మన్‌గా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, చైర్‌పర్సన్‌గా షేక్ రహత్, వైస్ చైర్మన్‌గా మొల్ల షరీఫ్‌బాషా, కార్యవర్గ సభ్యులుగా గుండం పెద్ద పుల్లారెడ్డి, షేక్ ఉస్మాన్‌బాషా, మల్లెపూల శిరీషా, గురులోల్ల సరోజమ్మ, కావేటి రాముడు, జీ.శివమల్లమ్మ, పోచా కల్యాణి, నైని సాత్విక, సందేపోగు డేవిడ్, వీ లక్ష్మీదేవమ్మ, షేక్ జలీల్ అహమ్మద్, షేక్ అబ్దుల్ గఫార్, కాట్రెడ్డి ఆది జగదీశ్వర రెడ్డిలను ఎంపికచేసింది.

నిజమైన విజనరీ సీఎం వైఎస్ జగన్

- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బోయరేవులలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే

వెలుగోడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిజమైన విజనరీ అని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. జగన్ పారదర్శకమైన పరిపాలన పట్ల ప్రజల అభిమానం రోజురోజుకు పెరుగుతోందని చెప్పారు. బుధవారం 118వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బోయరేవుల గ్రామంలో నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. అలాగే ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడంతో పార్టీ నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా పర్యటించి వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల పథకాలను లబ్ధిదారులకు వివరించి బ్రోచర్ అందించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని,పింఛన్లు మంజూరు చేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన చక్రపాణిరెడ్డి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.

విజన్ 2047 అంటూ చంద్రబాబు కొత్త రాగం

విజన్ 2047 అంటూ చంద్రబాబు కొత్త రాగం మొదలుపెట్టారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. చంద్రబాబు గతంలో చెప్పిన విజన్ 2020 ఏమైందని ప్రశ్నించారు. 50 నెలల పాలనలో వైఎస్ జగన్ గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చారని, గడప వద్దకే పాలన తీసుకువచ్చారన్నారు. ఎవరెన్ని చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాలు చేరిక

బోయరేవుల గ్రామానికి చెందిన 50 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీ గూటికి చేరాయి. బుధవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో టీడీపీ నాయకులు ఎం.నిరంజన్, సుంకన్న, నాగేంద్రుడు, ద్వారం వెంకటరమణ, రామసుబ్బయ్యతో పాటు దాదాపు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి శిల్పా చక్రపాణిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంతో ఆయన పాలనకు ఆకర్షితులై పార్టీ చేరినట్లు టీడీపీ నాయకులు చెప్పారు. కార్యక్రమంలో శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రెడ్డి, ఏపీసీపీడీసీఎల్ రీజనల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శశికళారెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్‌నాయుడు, సింగిల్‌విండో డైరెక్టర్ రమణ, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, నాయకులు గోవిందు, లక్ష్మయ్య, అయ్యవారిపల్లె శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

ఆత్మకూరు: కరివేన, నల్లకాల్వ గ్రామాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట వర్షాభావ పరిస్థితుల వలన తీవ్రంగా దెబ్బతినిందని, పంటలు దెబ్బతిన్న ప్రతిరైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని కరివేన, నల్లకాల్వ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేయాలని చెప్పారు. తద్వారా రైతులకు ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు రైతులకు వర్తిస్తాయన్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు తాను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో చర్చించి పంట నష్టపరిహారం కోసం సిఫారసు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ ఆంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో బలగం సినిమా నిర్మాత



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను బలగం సినిమా నిర్మాత హర్షిత్‌రెడ్డి దర్శించుకున్నారు. వీరు స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకుని, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆయన తో పాటు శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపక్షయ్యస్వామి తదితరులు ఉన్నారు.

డిప్ పద్ధతిలో ఇళ్ల స్థలాల కేటాయింపు




డిప్ ద్వారా లబ్ధిదారులకు ప్లాట్ నంబర్ కేటాయిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

ఆత్మకూరు: పట్టణంలోని కల్వకుర్తి-నంద్యాల నేషనల్ హైవేలో ఇంటి స్థలాలు కోల్పోయిన లబ్ధిదారులకు తిరిగి ఇంటి స్థలాలు కేటాయించినట్లు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవా రం డిప్ ద్వారా ఇంటి స్థలాల ఫ్లాట్ నంబర్లు కేటాయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఆత్మకూరు పట్టణంలో ప్రతి లబ్ధిదారునికి సెంటుకు బదులు సెంటున్నర చొప్పు న స్థలం కేటాయించి పట్టాలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి లబ్ధిదారుడికి పట్టాలను కేటాయిస్తామని చెప్పారు. పట్టాలు పొందిన వారు ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలని చెప్పారు. జగనన్న కాలనీలో మంచినీరు, విద్యుత్ సౌకర్యం, రహదారుల ఏర్పాటుతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్, కో ఆప్షన్ సభ్యుడు రషీద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి, బోగిరెడ్డి, నాయకులు విజయచౌదరి, పువ్వాడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బరక సంజీవరాయుడికి పూజలు

మిడుతూరు: మండలపరిధిలోని రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామివార్లకు అమావాస్యను పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, ఆకుపూజ, తదితర విశేషపూజలను పురోహితులు నరహరి శర్మ, కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేపట్టారు. విశ్రాంత అధ్యాపకులు మల్లికార్జున రావు, ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ నాగస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓంకార సిద్ధేశ్వరస్వామికి తైలాభిషేకం



మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన ఓంకారంలో బుధవారం అమావాస్యను పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి తైలాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలు చేపట్టారు. భక్తులు స్థానిక కాశిరెడ్డినాయన అన్నదానం వద్ద అన్నప్రసాదాలు స్వీకరించారు.

సున్నిపెంటలో నిర్మాణాలు చేపట్టరాదు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని తహసీల్దార్ రాజేంద్రసింగ్ బుధవారం నోటీసులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సున్నిపెంట గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని, సర్వే పూర్తయిన తర్వాత జిల్లా కలెక్టర్‌కు నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 208.74 ఎకరాల లో ఉన్న సున్నిపెంట గ్రామాన్ని పంచాయితీరాజ్ శాఖకు అప్పగించడం జరిగిందన్నారు. కట్టడాలను క్రమబద్ధీకరించడం, లీజుకు ఇవ్వడం, బదిలీచేయడం వంటి అంశాలు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ రాజ్‌శాఖ అమలు చేస్తుందని తెలిపారు. అంతవరకు ఎవరైనా అక్రమంగా కట్టడాలను చేపడితే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడంతో పాటు నిర్మాణ సామగ్రిని సీజ్‌చేస్తామని హెచ్చరించారు.

ధర్మకర్తలకు నేడు శిక్షణ

మహానంది: కర్నూలు, నంద్యాల జిల్లాలోని ధర్మకర్తల మండలి చైర్మన్లు, సభ్యులకు మహానంది దేవస్థానంలో గురువారం శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర దేవాలయ పరిపాలన సంస్థ(ఎస్‌ఐటీఏ) ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందని చెప్పారు.